# కొద్దికథలు

## దెబ్బకు దెబ్బ

ఆరోజు ఆదివారమైనప్పటికీ, మరుచటిరోజు ఆఫీసరు ఊరికి వెడతానని ఆదివారంకూడ వర్కింగుడేగాపెట్టాడు. అంతక్రితం పదిసార్లు పిల్లని చూసుకోవడానికి మా ఇంటికి వచ్చివెళ్ళమని చెప్పిపోతున్నాడు. మా అబ్బాయికి యితర రోజుల్లో శలవుదొరకదు. కనుక రేపు ఆదివారం మధ్యాహ్నం వస్తానని మా నాయనగారు మాటయిచ్చాడు, తీరా ఈ ఆదివారం ఆఫీసు పెట్టేటప్పటికి ఎట్లాగురా భగవంతుడా! చివరికి మాటయిచ్చానని మా నాయనగారు గాభరాపడ్డాడు. మీరేమి గాభరాపడకండి, నేను పర్మిషను తీసుకువస్తాను వెడదాము అన్నాను. సరే ఆ ఘడియ రానూవచ్చింది. నేను మా నాయనగారు ఆ వచ్చినాయనతో (పిల్ల మేనమామ) కలిసి జగన్నాథపురంలో పిల్లను చూసుకోవడానికి వెళ్లాము. సరే మాటా మంచిఅయింది. అమ్మాయిని తీసుకువచ్చి చూబెట్టారు. మధ్యలో నా విద్యాయోగ్యతలు, క్వాలిఫికేషన్సు అన్నిచెప్పి మానాయనగారు పిల్లనిగూర్చికూడ అడిగారు. చదువేమి లేదని, ఏదో చాకలిపద్దు వ్రాయడం, చదవడం చదువేగాని, ఎక్కువ విద్యాజ్ఞానం లేదనియు, సంగీతంకూడ చెప్పించలేదనియు, మా మూలుగా సాంప్రదాయంగానే ఉంటుందనియు చెప్పి, అసలు కుర్రవాని విషయములో సాంప్రదాయంతోబాటు కుర్రవాడు ఎడ్యుకేటెడ్ అయివుండాలని చూస్తున్నామని చెప్పాడు. ఆ మాటతో మా నాయనగారు మాట్లాడక ఊరుకున్నా, నాకుమాత్రం తలకొట్టేసినంత పనైంది. అంతమంది అడియన్సులోను ఆ విధంగా యిన్‌సల్టుచేయడం అంటే నాకు ఆయనమీద బలే కోపంవేసింది. వెంటనే నేను అవునండీ అందుకనే యిన్నిరోజులనుండి మేరేజి వేసికోలేదు. నాకు తగిన ఎడ్యుకేటెడ్ గరల్ సంగీతం, కుట్టు, హిందీ మొదలైనవి వచ్చిన గరల్ దొరకలేదనే యింత ఆలస్యమైంది. పాపం, వెరీ సారీ. ఈ అమ్మాయిలో నేను పైనజెప్పిన క్వాలిఫికేషన్సులో ఏ ఒక్కటి లేకపోవడం చాల.........అనేటప్పటికి ఆయన మొహం పాపం ఎట్లా వుంటుందో మీరే చెప్పండి. చచ్చానురా...దెబ్బకుదెబ్బ కొట్టాడు అని అనుకుంటూ ఏదో పని ఉన్నట్లు లోపలికి జారుకున్నాడు.

తంగిరాల హనుమంతరావు

* * *

## ఫూల్ అంటె

నేను రూమ్‌లో కూర్చొని చదువుకొంటున్నాను. అప్పుడు నా స్నేహితుని ఇంట్లోవున్న సర్వెంట్ బోయ్‌వచ్చి రంగబాబుగారూ మిమ్మల్ని అప్పారావుగారు 3-30కి రమ్మన్నారండీ అన్నాడు. సరే వస్తానని చెప్పు అన్నాను.

రంగబాబుగారూ చిన్న ఇంగ్లీషు మాటకి అర్థము చెప్పాలండీ అన్నాడు నెమ్మదిగ.

"ఫూల్ అంటే అర్థము ఏమిటండీ"

"బుద్ధిలేనివాడు" యని అర్థము.

"ఐతే నేను బుద్ధిలేనివాడినా?"

"ఎవరు అన్నారు అలాగని."

"ఎవరేమిటి, అప్పారావుగారన్నారు"

"ఏమన్నారు?"

"ఒరే ఫూల్ రంగబాబుని 3-30 కి రమ్మనమని చెప్పు" అన్నారు. అస్తమానూ ఫూల్ అని పిలుస్తారండీ. ఫూల్ అంటె అర్థము ఏమిటని అడిగితే మంచివాడని చెప్పేరండి. ఐతే మంచిదేకదా అని అనుకొన్నానండీ. అయితే ఇంక ఫూల్ అనవద్దని చెప్పుతానండీ.

"ఒరె అలా కాదురా, చిన్నట్రిక్కు చెబుతాను అలాగ చెయ్యి ఇంక వాడు యీ జన్మలో అనడు" అని చెప్పి చెయ్యవలసిన విధానం బోధపరచెను.

3-30 కి మా స్నేహితుని యింటికి వెళ్ళాను. అప్పారావ్ అని పిలచేను.

"ఏమండోయ్ ఫూల్‌గారు రంగబాబు వచ్చేరండీ" అన్నాడు సర్వెంట్ బోయ్.

ఏమిజరిగిందో తెలియదుగాని వాళ్ల ఇంట్లో మంచి పెద్దనవ్వులువినపడింది. వెంటనే నా స్నేహితుడు కోపముతో బయటకువచ్చి మా పిన్నివాళ్ళదగ్గర నన్ను ఫూల్ అని పిలుస్తావురా అని సర్వెంట్ బోయ్‌ని తిట్టడము మొదలు పెట్టేడు.

"నాకేమి తెలుసండీ ఫూల్ అంటె మంచివాడు అని మీరేగదా అన్నారు. అ...అ...అందుకని మి...మి... మిమ్మల్ని ఫూ...ఫూ...ఫూల్ అని పిలచేవండీ."

ఇంక శృతిమించి రాగాన పడుతుందని ఒరే నేనే యిలాగ చేయించేనురా అన్నాను.

అ...అ...నువ్వట్రా అనిపించింది, ఇంట్లో డేమ్ ఇన్సల్టు అయ్యేను రా అన్నాడు.

అందుచేత ఒరే ఇంటర్ నేషనల్ ఇడియట్ నువ్వు ఎవ్వరినీ వెక్కిరించకురా! అని వాడిని అన్నాను.

గాజుల పాండురంగారావు

* * *

## గొడుగు

ఒక రాత్రిసమయమునందు ఒక సత్రపు అరుగుపై పరుండి బాటసారి తనగొడుగు మరచి కొంతదూరము పోయెను. అంతలో చినుకులు ప్రారంభమైనవి. గొడుకుకొరకు సత్రము దగ్గరకు వచ్చాడు. అతనువచ్చిన ప్రదేశముననే ఒకస్త్రీ ఒక పురుషుడు సత్సమము ప్రారంభించినారు. అ ప్రదేశములో బాటసారి, వారిరువురుతప్ప మరీ ఎవ్వరూలేరు, బాటసారి మూలనున్న గొడుగునుచూచి మాటలు వినుచుండెను. పురుషుడు "కాంతా! ఏమి నీ చెక్కుటద్దములు! ఏమి నీ కంఠము! ఏమి నీ యందము"అని మెచ్చుకొనగ ఆమె ఇవన్నియు నీవే కదా అనెను. మరల అతడు కాంతా! నీ యుంగరాల ముంగురులు, నీ వాలుజడ, నీ ముద్దు మోము, తీర్చిదిద్దిన కన్నుల సొగసు ఆహా! కన్నులు మూసిన కనబడవు" అనెను. ఆమె మరల అవన్నియు తమవే అనెను. ఏమి నీ కుచకుంభములు యెయ్యారమన్నాడు. అవన్నీ నీ సొత్తేకదా యన్నది. బాటసారి వినలేక విసిగి అన్నియు మీవేగాని ఆ మూలనున్న గొడుగు మాత్రము నాది బాబోయి! అని పెద్దకేక వేసినాడు. ఆ కేకతో కంగారున ఆ జంట పారిపోయినది. బాటసారి గొడుగు తీసుకొని తన దారి తనుపోయాడు.

మద్దుగారు సత్యారావు

## ఆహ్వానానికి ఆగ్రహం

నా ఉద్యోగానికి ఆర్డరు వచ్చింది. టెంపరరీకదా, ఎప్పుడు లాగిపారేస్తారో అని ఒక్కణ్ణే 200 మైళ్ళు ప్రయాణం చేసి ఉద్యోగంలో చేరుకున్నాను.

రెండునెలలుపోయాక మా అమ్మ, చెల్లెలు వచ్చారు. ఆవేళ నాతో పని చేస్తున్న ఓ స్నేహితుడు, వాళ్ళ ఆడవాళ్ళు మా అమ్మా చెల్లెళ్ళని చూడటానికి వస్తారని చెప్పాడు.

ఇంటిలో మా అమ్మతో ఈ సంగతి చెప్పి, వాళ్ళొచ్చేసరికి గోధుమపిండి రొట్టెలుతయారుచేయింపించా. (వాళ్ళు మార్వాడీలులెండి! మార్వాడీవాళ్ళకు రొట్టంటె అమితమైన ప్రీతి!)

సాయంత్రమయింది. వాళ్ళు రానే వచ్చారు. ఆడవాళ్లకెదురుగా నేనెందు కెళ్ళటమని మా అమ్మను పంపించా ఆహ్వానించటానికి. మాఅమ్మ "రండి, రండి!"అంటూ లోనికి ఆహ్వానించింది. మరి హిందీ మాటలు రావుగా! ఈ ఆహ్వానం వినేసరికి అగ్గి పర్వతంలా లేచింది ఒకావిడ! (బహుశా నా స్నేహితుని భార్యనుకుంటా!) ఆవిడ యిలా అనటం మొదలెట్టింది—"క్యా ముఝె తూ 'రండీ' కహతీహై? తుమ్ రండీ! తేరీమా రండీ!......" (ఏవిటీ? నన్ను 'రండీ' అంటున్నావా? నువ్వు రండీ! నీ తల్లి రండీ......)

నేనీ ఆగ్రహానికి నివ్వెరపోయా! మా అమ్మ ఏమయిందోనని కాబోలు బిక్కచచ్చిపోయింది!

కాస్సేపయాక నాకంతా అర్థమైంది! ఆమెను తిరిగి సర్దిచెప్పటంతో నా తల ప్రాణం తోక్కొచ్చింది.

'ఇంతకీ హిందీలో 'రండి' అన్న మాటకు అర్థం 'ముండ' అన్నమాట.

ఒకరిభాష ఒకరికి తెలియకపోతే యిలాంటి అనర్థాలే కదా జరుగుతా యనుకున్నాను.

ఆ మర్నాడు ఈకథంతా చెప్పేసరికి మా స్నేహితులు పగలబడి నవ్వారు.

కె. వి. కె. పట్నాయక్

## భలే తమాషా

రామప్పంతులుగారని మాకో తెలుగు పండితులుండేవారు. ఆయన క్లాసులో పాఠం చెపుతుంటే మనుషులే కాదు కదా, రాళ్ళుకూడ తన్మయత్వంతో అలకించవలసిందే. పాఠంలోలాగే చేష్టల్లో కూడ హావభావాల్ని ప్రకటిస్తూ మమ్మల్ని ఉక్కిరిబిక్కిరి చేసేసేవారు. అదే రోజుల్లో పోలయ్య అనే బంట్రోతుకూడ మా బడిలో పనిచేస్తుండేవాడు. పాపం! తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అనుకునే వట్టి అమాయకుడు. కాస్తో కూస్తో చదువుకున్నాడుకూడాను.

ఇంతకీ అసలేం జరిగిందంటే ఒక రోజు మా పండితుడు సీరియస్‌గా పాఠంచెబుతూ, తక్షణమే కంసుడు కోపోద్దీపమానసుండై ప్రళయకాల రుద్రునివలె కరవాలమును లంఘించి "ఓరీ! సేవకాధమా! నా అజ్ఞనే ఉల్లంఘించెదవుగా? ఇదే కాచుకొమ్ము. మదీయ కరవాలముచే నీ కంఠమును తుత్తునియలు గావించెద" నని ఒక్కుమ్మడిగా ఆ సేవకునిపై ఉరికేడని చెబుతూ, అంతకంటె ఎక్కువగా మా పండితుడే ప్రళయకాల రుద్రుడులాగ తయారై చేతిబెత్తంతోసహా ఒక్కగెంతు గెంతారు. ఇహ చూసుకోండి పాపం! అప్పుడే వరండామీద నడుస్తున్న పోలయ్యగుండె బేజారు యెత్తిపోయి గజగజ వణికిపోతూ, శరీరంమీద చైతన్యంకూడ లేకుండా, గద్గదస్వరంతో "బా-బ్బా-బు! నే-నేం-చే-శా-నం-డి! అ!-నే-నేం-చే-య-లే-దం-డి అయ్యో! అ! అంటూ అమాంతంగా పరుగులంకించుకున్నాడు. అంతటితో సరా—గాభరాలో అట్నించివస్తున్న లెక్కల మేష్టార్నికూడ గుద్దేశాడు. ఇదంతా కళ్ళారా చూస్తున్న మేము పొట్ట చెక్కలయ్యేటట్టునవ్వుకున్నాం. అంతేగాదు ఆనాటి విచిత్ర సంఘటన జ్ఞాపకానికొస్తే ఇప్పటికీ నవ్వుకుంటుంటాంకూడాను.

అంగజాల లక్ష్మణరావు